# విద్వేష, ఉన్మాద రాజకీయాలను తిరస్కరిద్దాం

మిత్రులారా,

ఇవాళ ఎన్నికలు జరుగుతున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. గత వాగ్దానాల మీద సమీక్ష లేదు. రాజ్యాంగాన్ని పరిపుష్టం చేయడానికి, హక్కులను విస్తరింపజేయడానికి ప్రతిపాదనలు లేవు. ఎదుటివారిని వ్యక్తిగత స్థాయిలో తిట్టుకోవడానికే నేతలంతా తంటాలు పడుతున్నారు. స్థాయీ భేదాలు లేకుండా అందరూ గల్లీ స్థాయి వాళ్ళలానే ప్రవర్తిస్తున్నారు. ఏ అభ్యర్థికీ డబ్బుకు కొదవలేనట్లు గా ఉంది. మల్టీ మిలియనీర్ లకు ప్రజా సేవ చేయాలనే సత్సంకల్పం ఎందుకు కలుగుతోందో?! ఎన్నికయ్యాక ఆ సంకల్పం ఎందుకు ఆవిరైపోతోంధో మరి!? ఐదేళ్ల కాలంలో అలాంటి వారి ఆస్తులు పది రెట్ల నుంచి 100 రెట్ల వరకు ఎలా పెరిగిపోతున్నాయో? ఓట్లేసిన రైతులు, నేత కార్మికులు కునారిల్లి పోవడం ఎందుకో? ఆత్మహత్యలు చేసుకోవడం ఎందుకో? వారి ఆస్తులు పెరగకుండా అప్పులే ఎందుకు పెరిగి పోతాయో?

ఒక పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే అతడు / ఆమె ఆ పార్టీలోనే కొనసాగుతారని హామీ ఏమైనా ఉందా? ఓటర్ల అభిమతాన్ని గౌరవించాలని గెలిచిన వారికి ఎందుకు ఉండడం లేదు? ఎన్నికల్లో తిట్టుకొని గెలవగానే అధికారంలోకి వచ్చిన పార్టీలోకి జంపయిపోతామంటే అధికారంలోకి వచ్చిన పార్టీ నేతలు కండువాలు కప్పి ఆహ్వానించడం ఏ సంస్కృతి? ఇలా గెలిచిన వారిని చేర్చుకోవడం నీచ సంస్కృతి అని విపక్షంలో ఉన్నప్పుడు రంకెలేసిన వాళ్ళు అధికారంలోకి రాగానే అదే నైచ్యానికి ఎందుకు పాల్పడుతున్నారు? ప్రజలంటే లిక్కర్ తాగి, బిర్యానీ తిని, నోటు తీసుకుని ఓటు వేసే వారిగా పార్టీలు భావించడం వల్లే కదా ఇలా జరుగుతోంది? పార్టీ మీటింగులకి కూడా శ్రోతలను డబ్బులిచ్చి తరలించడమే నా? కులాలవారీగా మీటింగులబీ కులాల వారిగా డబ్బుల పంపిణీ!! అధికారంలో ఉన్నవాళ్ళు ప్రభుత్వ సొమ్మును తింటుంటే ప్రశ్నిస్తామని ఏ ఓటర్ అయినా అనుకుంటే నువ్వు మాత్రం తినకుండానే ఓటు వేసినవా అని అంటారేమోననే భీతితోనే ఓటర్లు మౌనంగా ఉంటున్నారా?

స్వతంత్రంగా ఉండవలసిన ఎన్నికల కమిషన్, దాని కింద పనిచేసే యంత్రాంగం అధికారంలో ఏపార్టీ ఉంటే వారికి పల్లకి మోస్తున్నది. ఓటర్ల లిస్టు లోనుంచి అధికార పార్టీకి అనుకూల ఓటు కాదు అనుకున్న వారి పేర్లను తొలగిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు 23 లక్షల మంది ఓటర్ల పేర్లు లిస్టు లోనుంచి మాయమయ్యాయి. ఎన్నికలయ్యాక ఒక్క 'సారీ' తో సరిపెట్టేశాడు చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్!! 23 లక్షల మంది రాజ్యాంగ హక్కులతో ఆటలాడుకున్న వాడి కనీస చట్టపరమైన చర్యలు ఏమీ ఉండవు. చిత్రమైన దేశం

పత్రికలు పార్టీల కరపత్రాలు గా మారిపోయాయి. మాట వినని వారిని దారిలో పెట్టడానికి పాలకులు బెత్తాలు పట్టుకుని కూర్చున్నారు. దారికి రాకపోతే ఏమవుతుందో చెప్పడానికి గౌరీలంకేశ్ లు ఉదాహరణగా దొరుకుతారుగా.

ఎన్నికల నిర్వహణ అంటే ఇంకూ, దారమూ ఇలాంటి సరంజామా సరఫరా చేయడం మాత్రమే అనుకునే అధికారులు ఉన్నచోట అభ్యర్థులూ, పార్టీలూ ఎన్నికల కోడ్ ఉల్లంఘన లకు పాల్పడుతుంటే అడ్డుకోవాలని కోరుకోవడం అత్యాశే నేమో! సోషల్ మీడియాను ఎన్నికల కోసం విపరీతంగా వాడేస్తున్నారు అభ్యర్థులూ,పార్టీలూనూ. దాన్ని పర్యవేక్షించే యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో ఎన్నికల కమిషన్ ఇంకా ఏర్పాటు చేసుకోకపోవడం వెనకబాటుతనం అనుకోవాలా? సంకల్ప లోపం అనుకోవాలా? సోషల్ మీడియాను తప్పుడు వార్తల కోసం, తప్పుడు సర్వేల కోసం వాడుతున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే డేటా బ్యాంకుల నుంచి, డేటా గ్రిడ్ నుంచి డేటా చౌర్యం మరో ఎత్తు. టెక్నాలజీలో మహాకాయులైన గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ లాంటి సంస్థలు తమ కస్టమర్ల డేటాను అమ్ముకుంటున్నాయి. రాజకీయ పార్టీలు కొంటున్నాయి. నిర్దిష్ట వ్యక్తుల, గ్రూపుల, కమ్యూనిటీల వారీగా అభ్యర్థులూ, పార్టీలూ సోషల్ మీడియాను పెద్ద ఎత్తున వాడుకుంటున్నాయి. ఎలాంటి పర్యవేక్షణ లేదు. ఎలాంటి నియంత్రణా లేదు. చాయ్ కి ఇంత, బిర్యానీ కి ఇంత, ఇడ్లీ ప్లేటుకు ఇంత అని మార్కెట్లో ఎక్కడా దొరకని అతి తక్కువ ధరకు ఉదారంగా ఎన్నికల యంత్రాంగం ధరలను నిర్ణయించింది. మీటింగులకు, ర్యాలీలకు వచ్చిన జనం సంఖ్యను బట్టి ఖర్చులను అంచనా వేస్తున్న యంత్రాంగం, పేపర్లలో టీవీలలో వచ్చే ప్రకటనల ఖర్చును అంచనా వేస్తున్న యంత్రాంగం సోషల్ మీడియా ఖర్చులను అంచనా వేయడంలో పూర్తిగా విఫలమైంది. ఆ ఖర్చు పై అదుపు లేదు. అందుకే మీరు స్మార్ట్ ఫోన్ వాడుతున్నవారయితే మీ ఫోన్ లోకి మీ ప్రమేయం లేకుండానే పార్టీల అభ్యర్థులు మెసేజ్లు కుప్పలుతెప్పలుగా వస్తున్నాయి. "మై భీ చౌకీదార్" కి ప్రతిగా వచ్చిన "చౌకీదార్ చోర్ హై" నినాదాన్ని నిర్బలం చేయడానికి కోటి మందిని రంగంలోకి దింపామని న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అంటున్నాడు. ఈ ఖర్చుని ఎలా అంచనా కడుతుంది ఎలక్షన్ కమిషన్? అసలు దాన్ని ఖర్చు ఖాతా లో రాస్తారా?

భూతాపం పెరిగిపోతోంది. వాతావరణంలో తీవ్ర మార్పులు వస్తున్నాయి. ఈ మార్పులు మానవ జీవనాన్ని అతలాకుతలం చేయగలవు. ఇప్పటివర కూ గాలిలోకి విడుదలైన కర్బనాన్ని తిరిగి భూమిలోకి పంపాలంటే రసాయనిక వ్యవసాయాన్ని విడనాడి సేంద్రియ పద్ధతికి మారినప్పుడే భూతాపం సమస్యకు పరిష్కారం. కర్బనం వల్ల బియ్యంలో మాంసకృత్తులు, ఇనుము- జింక్ లాంటి సూక్ష్మపోషకాలు, విటమిన్లు తగ్గిపోతాయి. మనది బియ్యం తినే దేశం. ఈ సమస్యను రాబోయే పాలకులు పట్టించుకుంటారా?

గత ఐదేళ్ల పాలనలో బిజెపి కీ కొంతమంది ఎంపిక చేసుకున్న బడా పెట్టుబడిదారుల కీ మధ్య బంధం గట్టిపడింది. ఈ పెట్టుబడిదారుల కనుసన్నల్లోనే దివాలా కోడు లాంటి చట్టాలను పార్లమెంటు ఆమోదించింది. అంబానీ, అదానీ ల ఆస్తులు పెరగడానికి బీజేపీ ప్రభుత్వం పని చేసింది. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అదానీ ఆస్తులు పెరగడం మొదలైంది. మోడీని ప్రధాన మంత్రి అభ్యర్థిగా ప్రకటించిన రోజున ఐదు రూపాయల ముఖ విలువ కలిగిన అదానీ గ్రూపు షేరు ఏడాదిలోపల 786 రూపాయలకు చేరుకుంది. 2002లో 3,741 కోట్ల రూపాయ లు ఉన్న టర్నోవర్ 2014 నాటికి 75,659 రూపాయలకు చేరుకుంది. రఫేల్ జెట్ విమానాల తయారీ ని ఆవగింజలో 60 వంతు అనుభవం కూడా లేని అంబానీ కంపెనీకి మోడీ ప్రభుత్వం కట్టబెట్టింది. నీరవ్ మోడీ,విజయ్ మాల్యా లు బ్యాంకులకు టోపీ పెట్టి ప్రభుత్వానికి తెలిసే దేశం నుంచి ఉడాయించారు. వీళ్ళమీద చర్యలు ఏమైనా తీసుకుంటారా? ఒకప్పుడు 'నో-గో జోన్' (ఎవరూ పోవడానికి వీలు లేని ప్రాంతం) గా ప్రకటించబడిన చత్తీస్గఢ్ లోని అటవీ భూమి (లక్ష డెబ్బై వేల హెక్టార్లు)ని మోడీ ప్రభుత్వం అదానీకి కట్టబెట్టింది. అక్కడ గనులను తవ్వుకోవటానికి పర్యావరణ శాఖ అనుమతులనూ ఇచ్చేసింది.

ఇలాంటి వాటిని వ్యతిరేకిస్తే జాతి వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నారు. రాజద్రోహానికి పాల్పడినట్లు కేసులు పెడుతున్నారు. రాజ్య నిర్బంధానికి అదనంగా సంఘ పరివారం మూకలు చెలరేగిపోతున్నాయి. ఇలాంటి వాటిని 16 సీట్లు ఇమ్మని అడుగుతున్న వారు ఎన్నడూ ప్రశ్నించలేదు. ప్రశ్నించే

చింతనాపరుల ని నిరంతరం రాజ్యం డేగ కళ్ళు వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితిని మారుస్తారా రాబోయే పాలకులు?

ఇక 16 సీట్లు అడిగే పెద్దమనిషి కి ముహూర్తాల వాస్తు పిచ్చి ఐతే, రామాయణ-భారత కాలం లోనే భారతీయ సైన్సు ఉచ్ఛ స్థితిలో ఉందని ఎచ్చులు పోతాడు మోడీ. వాయు గతిశాస్త్రం, అణ్వాయుధాలు, మూల కణ జీవశాస్త్రం, ప్లాస్టిక్ సర్జరీ లాంటివి ప్రాచీన భారతంలో చాలా ఫేమస్ అని ఆయనగారి ఉవాచ. అహేతుక కి, అశాస్త్రీయత కి పెద్ద పీట వేయడం మానేస్తారా?

ప్లానింగ్ కమిషన్ ని పడుకోబెట్టారు. ఎలక్షన్ కమిషన్ ని లొంగ తీసుకున్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కి అవసానదశ దాపురించింది. ఈ సంస్థల సాపేక్షిక స్వాతంత్ర్యాన్ని అయినా బ్రతకనిస్తారా?

కాశ్మీర్ పై వరస పెట్టి దాడులు చేస్తున్నారు. పాకిస్తాన్తో జగడం బీజేపీకి అధికారాన్ని తెచ్చిపెట్టే అస్త్రం. దేశభక్తి కూడా ఎన్నికల నినాదం అయిపోయింది. అందుకే "దేశభక్తి వాడి అబ్బ సొత్తు అంట... నిజమాడే వాడేమో నక్సలైట్ అంట" అని మహాకవి గారు వట్టిగా అనలే. ఇప్పుడు 'దేశభక్తియుత హిందూ భారత్' వర్సెస్ 'విద్రోహ పూరిత ముస్లిం కాశ్మీర్' అని రెచ్చగొడుతున్నారు. కశ్మీర్ సమస్యని శాంతియుతంగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తారా?

ఈ తీరున జరుగుతోంది భారత ప్రజాస్వామ్య ప్రక్రియ. ఇదొక ప్రహసనంగా మారకూడదు అనుకుంటే ప్రజలు జాగరూకులై ఉండాలి. ప్రజల జీవితాలు ఎంత సేపు పొట్ట నింపుకునే పనిలోనే కాలిపోతుంటే ఎలా జాగరూకులై ఉండగలరు? "ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్" అని గురజాడ అన్నా మరొకరు అన్నా ఇది నిజమే కదా. మనుషులు నిండైన మనుషులుగా జీవించటం అంటే స్వేచ్ఛలతో జీవించటం. అది జంతు ప్రాయపు ఉనికి కాదు. అందుకే

- రాజ్యాంగంలో రాసుకున్న హక్కులను అన్నిటి నీ ప్రజలు నిరాటంకంగా అనుభవించే పరిస్థితి కల్పిస్తామని ఎన్నికల పార్టీలు హామీ ఇస్తాయా?
- అధికారానికి వ్యతిరేకంగా, అధికారంలో ఉన్న వారి తాబేదార్ల కు వ్యతిరేకంగా మాట్లాడితే జాతి వ్యతిరేకులని, రాజద్రోహానికి పాల్పడ్డారని తప్పుడు కేసులు మోపకుండా ఉంటారా?
- రాజకీయ లక్ష్యాలతో ఏకీభావం కలిగినంత మాత్రాన నిషిద్ధ రాజకీయ సంస్థలతో లంకె పెడుతూ ఆలోచనాపరులను ఖైదు చేయకుండా ఉంటారా?
- ఒక పార్టీ అభ్యర్థిగా గెలిచినవారు పార్టీ మారితే వారి చట్ట సభ సభ్యత్వం రద్దు అవుతుందనే చట్టాన్ని తీసుకొస్తారా?
- పార్టీలూ, అభ్యర్థులూ చేసే వాగ్దానాలు నెరవేర్చకపోతే వారిపై చట్టపరమైన చర్యలకు వీలు కల్పించే చట్టాన్ని తెస్తారా?
- రైతులకు పంట పండించడానికి అయిన ఖర్చు కి 150 శాతం అదనంగా కలిపి గిట్టుబాటు ధరలను కల్పిస్తారా? సాగుకు అవసరమయిన ముడిసరుకులను చౌకగా అందిస్తారా? ఆత్మహత్యలు లేని భారతాన్ని హామీ ఇస్తారా? కిసాన్ పార్లమెంటు కోరిన గిట్టుబాటు ధరల చట్టాన్ని రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంట్లో ఆమోదిస్తారా? రైతులను బిచ్చగాళ్ళు గా చూసే పద్ధతిని మానేస్తారా?
- ఉద్యోగాల పరికల్పన వాగ్దానం నిరుద్యోగులను ఊహల ఊయలలో ఊగేలా చేయటానికి కాక నేల మీద నిలబడి ఉద్యోగులు అయ్యేలా చేస్తుందా?
- స్కూలుకు వెళ్లాల్సిన పిల్లలు అందరూ ఇంకా స్కూలు మొహం చూడలేకపోతున్నారు. చదువు పిల్లల మౌలిక హక్కు కదా. దాన్ని గౌరవిస్తారా? చదువుకోవాలంటే బడులు ఉండాలి వాటిల్లో పంతుళ్ళు ఉండాలి. ఉపాధ్యాయుల్ని నియమించకుండానే ఐదేళ్ళూ గడిపేశారు. రాబోయే ఐదేళ్లలో ఖాళీలన్నీ భర్తీ చేస్తారా? సాంఘిక సంక్షేమ హాస్టళ్లు నివాసయోగ్యంగా లేవు. వాటిని పట్టించుకుంటారా?
- మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ల గురించి మీరు చెప్పిన కబుర్లకి చెవులు దిబ్బళ్ళు ఎత్తినయ్ గాని ప్రాథమిక ఆరోగ్యాన్ని ప్రజలకు అందిస్తారా? విష జ్వరాలకు ఏజెన్సీలు నిలయాలు. ఆ పరిస్థితిని చక్కదిద్దుతారా?
- ఊరుమ్మడి భూములను, ప్రభుత్వ ఖాళీ స్థలాలను అలాగే అట్టిపెట్టి కాపాడతారా? ఆవరణ మార్పుకి దీనికి సంబంధం ఉందని మీకు తెలియకపోవచ్చు లెండి.
- దళితులపై, మహిళలపై, బాలల పై జరుగుతున్న అత్యాచారాలకు ముగింపు పలకాలని ఎప్పటినుంచో కోరుతున్నాం. మీ అధికారులు ఆ వైపుగా అడుగులు వేయడం లేదు ఎందుకో మరి! రాబోయే ఐదేళ్లలో నైనా.........?.

మిత్రులారా,

విద్వేషం ఒకడికి ప్రచారాస్త్రం. ప్రాంతీయం మరొకరికి ప్రచారాస్త్రం. ఈ ఐదేళ్లలో జరిగింది పరిపాలనలో పతనం, ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం, దివాలా తీసిన దౌత్యనీతి, విఫలమైన విదేశాంగ విధానం, అందలమెక్కిన అవినీతి, స్కీముల స్థాయికి చేరిన స్కాములు. హక్కుల హననం. తినే తిండి పై తీవ్ర ఆంక్షలా? మనిషిని చంపితే ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం విచారణ తర్వాత శిక్ష. ఆహారం కోసం జంతువును చంపితే "హిందూ పీనల్ కోడ్" ప్రకారం విచారణ కూడా లేని తక్షణ న్యాయం. శిక్ష? మరణం. ఫాసిస్టు పాలన వైపు అడుగులు వడివడిగా పడుతున్నాయి. వాటిని ఇప్పుడే నిలువరించాలి. 'నువ్వు కొట్టినట్లు నటించు నేను దెబ్బ తగిలినట్లు నటిస్తా' ననే నటకులను ఓ కంట కనిపెట్టాలె. అవకాశం వచ్చింది ఓటుతో వేటు వేయాలె.

తేది: 1-4-2019

Please visit : **humanrightsforum.org.**

**మానవ హక్కుల వేదిక**

**(HUMAN RIGHTS FORUM)**

తెలంగాణ రాష్ట్ర కమిటి

ప్రచురణ : గొర్రెపాటి మాధవరావు, అధ్యక్షుడు, జి. మోహన్, ప్రధాన కార్యదర్శి